క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కిర్లంపూడి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తోట రవి ఆదివారం తెలిపారు. సమావేశంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మండల అభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

10న తాండవ ఆయకట్టుకు నీరు విడుదల

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి ఈ నెల 10న నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ స్వామినాయుడు ఆదివారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 1.08 గంటలకు మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేస్తారని వివరించారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయకట్టు రైతులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



రత్నగిరిపై సూర్య నమస్కారాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు ఆకొండి కృష్ణశర్మ, రాందాసు, నాగాబట్ల కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం


జగ్గంపేటలో శ్రీరామానుజ ప్రియ గోవర్దన కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రామానుజ ప్రియగోవర్దన కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో 130 మంది దంపతులు పాల్గొన్నారు. త్రిదండి చిన జీయర్ స్వామివారి మంగళాశాసనములతో శ్రీమాన్ పరాశర రఘునాథ్ బట్టర్ స్వామి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు, సంఘ నేతలు కొత్త భైరవకృష్ణ, మానేపల్లి బంగార్రాజు, కొత్త రాము, సుధీర్, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో తీసుకోవాలి

తుని: డిగ్రీ అడ్మిషన్లు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలు గడుస్తున్నా కొందరు విద్యార్థులు అవగాహన లేక ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోలేదన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోవాలని కోరారు.

ఘనంగా జక్కంపూడి జయంతి


ప్రత్తిపాడు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి

ప్రత్తిపాడు: గ్రామంలో ఆదివారం దివంగత నేత జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జక్కంపూడి చిత్రపటానికి జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు, ఉల్లింకల భద్రం, ధరణాల కోట తాతబ్బాయి, ఎం.రాజారావు, ఉమ్మిడి కృష్ణ, కంచుమర్తి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కొండంత అండ

- వైఎస్సార్ సున్నావడ్డీతో అక్కచెల్లెమ్మలకు ఆసరా
- మూడు నియోజకవర్గాల్లో 15,846 డ్వాక్రా సంఘాలు
- ఈ నెల 10 నాలుగో విడత ప్రారంభం
- మహిళలకు రూ.20.02 కోట్ల మేర చేకూరనున్న లబ్ధి


ధర్మవరంలో సున్నా వడ్డీ పథకంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వాక్రా మహిళలకు ఆసరాగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా బలపడుతున్నారు. ఇంటిని చక్కదిద్దే స్థాయిలో మహిళలు వారి కాళ్లపై వారు నిలబడుతున్నారు. దుకాణాలు, ఫ్యాన్సీ, కిరాణా షాపులు, బర్రెలు, ఆవులు, మేకల పెంపకం ఇలా పలు రకాల వ్యాపారాలతో కుటుంబానికి దన్నుగా నిలుస్తున్నారు. క్రమం తప్పకుండా బ్యాంకులకు అప్పు తీర్చడంతో ప్రభుత్వం సున్నా వడ్డీ రాయితీని చెల్లిస్తోంది. కాగా ఈ నెల 10న నాలుగో విడత సున్నా వడ్డీ పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

మూడు నియోజకవర్గాల్లో ఇలా..

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో నాలుగో విడత సున్నా వడ్డీ కింద 15,846 సంఘాలకు ప్రభుత్వం రూ.20.02 కోట్లు చెల్లించనుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 5,592 సంఘాలకు రూ.6.43 కోట్లు, తుని నియోజకవర్గంలో 4,725 సంఘాలకు రూ.5.91 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గంలో 5,529 డ్వాక్రా సంఘాలకు రూ.7.68 కోట్లు సున్నా వడ్డీని ప్రభుత్వం చెల్లించనుంది.

నాటికీ నేటికీ ఎంతో మార్పు

గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలు సకాలంలో రుణాలు చెల్లించక బ్యాంకుల వద్ద ఎన్‌పీఏగా ముద్ర వేసుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు సకాలంలో రుణాల సొమ్ములను చెల్లిస్తున్నారు. సకాలంలో రుణాలను చెల్లించడంతో ఎన్‌పీఏ శాతం అట్టడుగుకు చేరుకుంది. ఫలితంగా డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థిక పురోభివృద్ధిని సాధిస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోంది. ప్రభుత్వ సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నారు. తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు మహిళల జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– యెనుగంటి వెంకట్, వెలుగు ఏపీఎం, ప్రత్తిపాడు

ఆర్థిక భారం తగ్గింది



నేను ధర్మవరం బాల ఏసు డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. సున్నా వడ్డీ పథకం మాకు కొండంత అండగా నిలుస్తోంది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు అయ్యే వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తున్నందున జీవనోపాధి మెరుగైంది. ఈ పథకం కింద మా సంఘానికి 4వ విడత సున్నా వడ్డీ సొమ్ములు రూ.19,250 జమకానున్నాయి.

– ఊట పార్వతి లక్ష్మీసరస్వతి, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

మా కుటుంబాలు బాగు పడుతున్నాయి



నాడు వైఎస్సార్ పావలా వడ్డీతో ఆదుకుంటే ఇప్పుడు జగనన్న మరో అడుగు ముందుకు వేసి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నారు. నవరత్నాలను మాట తప్పకుండా అమలు చేస్తూ ప్రతి పథకాన్ని మహిళలకే అందజేస్తున్నారు. దీంతో కుటుంబాలు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద మా సంఘానికి 4వ విడత సున్నా వడ్డీ సొమ్ములు రూ.19,250 జమకానున్నాయి. మహిళలకు ఇంత మేలు చేస్తున్న జగనన్న ఎప్పుడూ సీఎంగా ఉండాలి.

– అప్పలబత్తుల సూర్యకుమారి, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

సుబ్బారెడ్డి సాగర్‌కు ఏలేరు జలాలు

జలవనరుల శాఖమంత్రిని కోరిన ఎమ్మెల్యే పర్వత


ఏలేరు కాలువపై రెగ్యులేటర్ ఏర్పాటు విషయమై మంత్రి రాంబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పర్వత

ప్రత్తిపాడు: ఏలేరు జలాలను ప్రత్తిపాడు మండలం సుబ్బారెడ్డి సాగర్‌కు అనుసంధానం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబును ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ కోరారు. ఆదివారం రాజమహేంద్రవరం వచ్చిన మంత్రి అంబటి రాంబాబును ఎమ్మెల్యే పర్వత కలిశారు. ఏలేరు ఎడమ కాలువ 13.30వ కిలో మీటరు వద్ద రెగ్యులేటర్‌ను ఏర్పాటు చేసి ఏలేరు జలాలను సుబ్బారెడ్డి సాగర్‌కు అనుసంధానం చేయాలన్నారు. అలా చేస్తే సుబ్బారెడ్డి సాగర్ పరిధిలోని 7,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూడా గతంలో ఎమ్మెల్యే పర్వత వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు త్వరితగతిన రెగ్యులేటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అంబటి రాంబాబును కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తుని రాజా ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు


శంఖవరం ప్రభుత్వ పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

తుని: స్థానిక రాజా ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా 25 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వీరంతా ఒకచోట కలుసుకోవడానికి బి.మూర్తి, దండెం నాగు, కటారి వీర్రాజు కృషి చేశారు.

శంఖవరంలో..

శంఖవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వీరంతా సుమారు 18 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి స్మృతులను నెమరువేసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో కలియతిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాలు ఒకరికొకరు చెప్పుకుంటూ సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు. అనంతర తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

రత్నగిరిపై అలరించిన కళా ప్రదర్శనలు


థింసా నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో ధర్మ ప్రచార మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆదివారం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కేరళ డప్పులు, థింసా నృత్యం, కోలాటం, హరిదాసు, గంగిరెద్దుల వాళ్లు తదితరులు తమ కళా ప్రదర్శనలతో అందరినీ అలరించారు. కాగా ఈ కార్యక్రమానికి వచ్చిన దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు సహస్ర దీపాలంకార మందిరంలో సత్యదేవుని వ్రతమాచరించారు. పండితులు ఛామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి తదితరులు మంత్రికి వ్రతకథను వివరించారు.


కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు


కాళికా నృత్యంలో భాగంగా అమ్మవారికి ధూపం వేస్తున్న దృశ్యం

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- లివర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి
- దాతల సహాయం కోరుతున్న కుటుంబ సభ్యులు


ఏవీ నగరంలో లివర్ వ్యాధితో బాధపడుతున్న కొంజర్ల కృష్ణ

తొండంగి: చిరువ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే అతని జీవితంలోకి లివర్‌వ్యాధి పిడుగులా వచ్చింది. దీంతో వైద్యం కోసం అప్పుల పాలై చివరకు మంచాన్ని పట్టాడు. వైద్యులు లివర్ మార్పిడికి రూ.25 లక్షలకు పైగా ఖర్చవుతుందని చెప్పడంతో దాతల ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. వివరాల్లోకి వెళితే... తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన కొంజర్ల కృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుదిరితే కూలి పని, అప్పుడప్పుడు ధాన్యం వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా లివర్ దెబ్బతిందని వైద్యులు నిర్ధారించారు. లివర్ మార్పిడి చేయాలని తెలిపారు. దీనికి రూ.25 లక్షలు ఖర్చవుతుందని తెలపడంతో ఆ కుటుంబానికి ఏమి చేయాలో పాలుపోలేదు. ఇప్పటికే వైద్యం కోసం ఉన్నదంతా ఖర్చు చేసి ఆర్థికంగా చితికిపోయిన ఆ కుటుంబానికి వేరొక మార్గం లేక దాతల సహాయం కోరుతున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు సమకూరుతుండగా మిగిలిన రూ.15 లక్షల కోసం దాతల సహాయం కోరుతున్నట్టు కృష్ణ భార్య లక్ష్మి తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ వంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా కొందరు దాతలు ఆర్థిక సహాయం అందించినప్పటికీ వైద్యానికి డబ్బులు సరిపోని పరిస్థితి నెలకొంది. సహాయం చేసే దాతలు బ్యాంకు అకౌంట్ నంబర్ 0623101013138 (కెనరా బ్యాంకు ఏవీ నగరం బ్రాంచ్) లేదా 79818 16770 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని బాధితుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గద్దర్ మృతికి సంతాపం

ప్రత్తిపాడు: ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు సంతాపం వ్యక్తం చేశారు. గద్దర్ గతంలో విప్లవోద్యమంలో పనిచేశారని, తన పాటలతో యువతను ఉత్తేజపరచారన్నారు. ఆయన పాటలతో ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశ వ్యాప్తంగా యువత విప్లవ ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారన్నారు. గద్దర్ మృతి సాంస్కృతికోద్యమానికి తీరని లోట అన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. కాగా గద్దర్ మృతికి ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ సంతాపం ప్రకటించారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో తాగునీరు సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం లభిస్తుందన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి ప్రతిఒక్కరికీ రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

నిందితులను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

గండేపల్లి: పశువులను తీసుకుపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తులను గ్రామస్తులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని తాళ్లూరు శివారులో ఇంటి ముందు కట్టి ఉన్న గేదెను ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు తీసుకుపోయేందుకు ప్రయత్నించారు. వీరిని స్థానికులు పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. కాగా గతంలోనూ ట్రాక్టర్ బ్యాటరీలు, ఇతర సామగ్రి చోరీకి గురైనట్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు ఆరుగొల్లు మోసి తెలిపారు.

పుస్తకావిష్కరణ

కాకినాడ కల్చరల్: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత రెంటాల వేంకటేశ్వరావు రచించిన ఒకసారి ఆలోచిద్దామా పుస్తక పరిచయ సభ ఆదివారం సాయంత్రం డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగింది.

జాతీయ అంశాలపై అవగాహన పెంచుకోవాలి

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ


దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ నుంచి బహుమతులు తీసుకుంటున్న శ్రీప్రకాష్ విద్యార్థులు

తుని: విద్యతో పాటు జాతీయ అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. తుని రైల్వేస్టేషన్ అమృత్ భారత్ పథకానికి ఎంపికైన విషయం పాఠకులకు తెలిసిందే. విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులకు రోహన్ మధుకర్, భవ్య, కృష్ణచందన ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ రాజు, మున్సిపల్ చైర్పర్సన్ ఏలూరి సుధారాణి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులను రైల్వే నోడల్ అధికారి మునిరెడ్డి, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, ప్రధానోపాధ్యాయురాలు సీతారాణి తదితరులు అభినందించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


ఏలేశ్వరంలో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న వైఎస్సార్ సీపీ నేతలు


ధర్మవరంలో రక్తదానం చేస్తున్న స్నేహితులు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం స్నేహితులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్నేహితులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేస్తూ సందడి చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్నేహితులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సృష్టిలో అన్ని బంధాలు కన్నా విలువైంది స్నేహబంధమే అన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు యినగిరి ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్ కుమార్, కోరాడ ప్రసాద్, సామంతులు రామన్న, సిరిపురపు రాజేష్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆదివారం రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పట్టపు వీధి యూత్ ఆధ్వర్యంలో రోగులకు వీటిని అందజేశారు. తమ యూత్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మణికంత, సాయి, రాజా, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఆదివారం ఫ్రెండ్స్ యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల మృతి చెందిన నానిపల్లి సురేష్ జ్ఞాపకార్థం అతని మిత్రులు కాకినాడకు చెందిన సిద్దార్థ వలంటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 35 మంది మిత్రులు రక్తదానం చేశారు. తొలుత నానిపల్లి సురేష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

మంత్రి మాతృమూర్తి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు


తుని ఎస్‌ఎంబీ చర్చి ఆవరణలో ప్రార్థనలు చేస్తున్న సంఘ సభ్యులు

తుని: ఇటీవల గుండె పోటుతో తుది శ్వాస విడిచిన రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాతృమూర్తి సత్యనారాయణమ్మ ఆత్మకు శాంతి కలగాలని తుని స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సత్యనారాయణమ్మకు స్వస్తత కలగాలని సామూహిక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు రాజా కుటుంబానికి అండగా ఉండాలని ఆశీర్వదించారు. స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు బీజేవీ ప్రసాద్, డీక్యాంబోర్డు చైర్మన్ దల్లి శ్యాంసన్, కార్యదర్శి డి.అమర్‌నాథ్, కోశాధికారి పాల్ రమేష్, చర్చి కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఘన నివాళులు

కోటనందూరు: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాతృమూర్తి సత్యనారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా ఆదివారం భీమవరపుకోట అరుంధతి కమ్యునిటీ హాలులో ఎంఆర్‌పీఎస్ మండల శాఖ అధ్వర్యంలో సత్యనారాయణమ్మ సంతాప సభ నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడు, మాదిగ పోరాట రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే, సర్పంచ్ జిగటాల వీరబాబు, ఎంపీటీసీ కొత్తపల్లి మాణిక్యలరావు సత్యన్నారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దండేటి పృథ్వీ, కొప్పల గణేష్, ఆరుగుల అప్పారావు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

కిర్లంపూడి: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు కిర్లంపూడి ఎస్సై ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... జూన్ 30న మండల పరిధిలోని రామచంద్రపురం సచివాలయం వద్ద అదే గ్రామానికి చెందిన వేమగిరి సాయమ్మ చెప్పులు మరిచిపోయి ఇంటికి వెళ్లిపోయింది. మళ్లీ వచ్చి సచివాలయం చుట్టుపక్కల తన చెప్పులు వెతుకుంటుండగా సచివాలయం పక్కనే ఉన్న ఇంటి యాజమాని తొట్టెంపూడి వెంకటలక్ష్మి(చిన్న), అతని సోదరుడు కృష్ణయ్య ఆమెను కులం పేరుతో దూషించారు. దీనిపై సాయమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు.

విద్యార్థుల శ్రమదానం


ప్రత్తిపాడులో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదాన ప్రాంతాన్ని శుభ్రం చేశారు. పాఠశాలకు సెలవు కావడంతో విద్యార్థులంతా పలుగు, పార చేతబట్టి ఆవరణలో భారీగా పెరిగిపోయిన తుప్పలను తొలగించారు. వసతిగృహ ఆవరణలోని చెత్త, వ్యర్థాలను తొలగించారు. విద్యార్థుల శ్రమదానాన్ని వసతి గృహ సంక్షేమాధికారి ఎం.సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.